APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 11 సెప్టెంబరు 2026 సంపుటి: 01 సంచిక :107 పేజీలు : 04 వెల: 2-00/-

## వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలి

### వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

- ★రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- ★సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- ★కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- ★టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం




అమరావతి: రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం మిగతా 2 లో

## నాయకులు అహంకారానికి దూరంగా ఉండాలి

### ఎంపీ రామ్మోహన్ నాయుడు



- నాయకత్వం బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్న రామ్మోహన్
- అభ్యర్థి ప్రవర్తన ఎన్నికల్లో 68.9% ప్రభావం చూపుతుందని వెల్లడి
- ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచన
- ఎంత ఎదిగినా అహంకారం దగ్గరకు రానీయవద్దని హితవుతంత



## మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం.. డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

### తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

- ➢ అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్
- ➢ ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్‌ను కోరిన వైనం
- ➢ స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మిగతా 2 లో



### అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి



### తెలంగాణలో మళ్లీ వర్షాలు..

## 20 జిల్లాలకు అలర్ట్ జారీ

తెలంగాణలో మళ్లీ ప్రారంభమైన వర్షాలు

రాష్ట్రంలోని 20 జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్ సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

## నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

### స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి

- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం



నెల్లూరు: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన మిగతా 2 లో

## తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

### బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ

- ★కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- ★2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- ★పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ★లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



హైదరాబాద్: తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని మిగతా 2 లో

### గ్రామ నిధులు నేరుగా సర్పంచ్‌లకే ఇచ్చేలా కొత్త బిల్లు ప్రవేశపెడుతున్నాం



- ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విధానంలో మార్పులు
- ఒత్తిళ్లను తట్టుకుని దృఢంగా ఉండాలని సర్పంచ్‌లకు సూచన

హైదరాబాద్ : తెలంగాణలోని సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీపికబురు అందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన



### పన్నులు వసూలు చేయడం

## పవన్‌కు తెలుసు

పేపర్ మిల్లు వ్యవహారంపై స్పందించిన ఎంపీ పురందేశ్వరి

- పన్ను బకాయిలు మంత్రి పవన్ వసూలు చేస్తారన్న విశ్వాసం
- యాజమాన్యాలకు సామాజిక బాధ్యత ఉండాలని హితవు
- నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం

### ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

- అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్.. భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మిగతా 2 లో



మొదటి పేజి తరువాయి

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

# టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

"గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి" అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా

శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం..

# రంగంలోకి దిగిన పవన్ కళ్యాణ్

అమరావతి : కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తిరుపతివిజయవాడ మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభం

తొలి ప్రయాణికులకు ఆయన స్వయంగా టికెట్లు అందజేశారు. వారంలో నాలుగు రోజుల పాటు తిరుపతివిజయవాడ మధ్య ఈ విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. కొత్త విమాన సర్వీసు అందుబాటులోకి రావడం ద్వారా విజయవాడ, తిరుపతి మధ్య ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. 'కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కృతజ్ఞతలు. ఆదివారం కూడా తిరుపతివిజయవాడ మధ్య విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. గన్నవరం విమానాశ్రయం నుంచి ఎమిరేట్స్, ఖతర్, లుఫ్తాన్సా వంటి అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. గత 12 ఏళ్లలో గన్నవరం విమానాశ్రయం భారీగా అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

## అంతరిక్షం అందరిదీ- బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

ఢిల్లి : అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు : పొన్నం ప్రభాకర్

సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైనా ఏపీ ఆర్టీసీలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని పేర్కొన్నారు. 347.47 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణం : హైదరాబాద్ నగరానికి వంద మినీ బస్సులు రాబోతున్నాయని మంత్రి ప్రకటించారు. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇదొక రికార్డ్ అని పొన్నం వెల్లడించారు. "ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు

## తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం - అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన

మొదటి పేజి తరువాయి

రానున్న కొద్ది రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 60 కి.మీ వేగంతో గాలులు : తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్ర తీరానికి వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులకు 48 గంటల





హైఅలర్ట్ : సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉన్నందున చిన్న పడవలు, మరబోట్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచార వ్యవస్థల ద్వారా సందేశాలు పంపుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పర్యవేక్షిస్తోంది.అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన : అల్పపీడన ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వరుణుడు ప్రతాపం చూపాడు. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో, ఉక్కపోతతో అల్లాడిపోతున్న స్థానిక ప్రజలను ఈ వర్షం పలకరించింది. వాన కారణంగా పలుచోట్ల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

# భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు

మొదటి పేజి తరువాయి

భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ పేర్కొన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు. అయితే భారత్ తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని ఆయుధాల తయారీకే వాడకపోవచ్చని, కొంత రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని హాన్స్ క్రిస్టెన్సెన్ కథనం పేర్కొంది. ఆయుధ సంపత్తిని పెంచుకున్నప్పటికీ భారత్ తన విధానాలకు కట్టుబడి ఉంది. 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షల తర్వాత భారత్ 'నో ఫస్ట్ యూజ్' సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాలను నిలువరించటానికి మాత్రమేనని పార్లమెంటులోనూ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, మరిన్ని కొత్త క్షిపణి వ్యవస్థలు అభివృద్ధి దశలో ఉన్నందున, రానున్న రోజుల్లో భారత్ అణ్వాయుధాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### ఏఏ దేశాల వద్ద ఎన్ని ఉన్నాయంటే?

ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత మెరుగుపరుచుకుంటున్నాయి. అయితే, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా అమెరికా, రష్యా ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) కొద్దిరోజుల క్రితం ఒక నివేదికలో వెల్లడించింది. రష్యా వద్ద 5,420, అమెరికా వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా, వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో యూకే (225), ఫ్రాన్స్ (370), ఉత్తరకొరియా (60), ఇజ్రాయెల్ (90), దేశాలున్నాయి. ఇక భారత్ విషయానికొస్తే, అణ్వాయుధాల విషయంలో మన దేశం కూడా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నాయని, అది పాక్ కంటే ఎక్కువేనని సిప్రి నివేదించింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని నివేదికలో పేర్కొంది. అలాగే,




చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ అని తెలుస్తోంది. ఇక, 2021-25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే కావడం విశేషం.

# రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనడానికి భారత్‌కు వస్తున్నారు.

మొదటి పేజి తరువాయి

ఆయన పాలనను వ్యతిరేకించే ప్రబలమైన శక్తి ఏదీ రష్యాలో లేదు. ఆయన కోరుకుంటే 2036 వరకు అధికారంలో కొనసాగగలరు. పుతిన్‌కు భారీ భద్రత ఉంటుంది. వందలాది మంది భద్రతాసిబ్బంది 24 గంటలూ ఆయనతోనే ఉంటూ పరిసరాలను నిశితంగా గమనిస్తూ ఉంటారు. పుతిన్ ఆహారాన్ని రహస్యంగా తయారు చేస్తారని, ఆయన తాగే ప్రతి పానీయాన్ని ముందుగా ఆయన అత్యంత సన్నిహిత సలహాదారులు తనిఖీ చేస్తారని బీబీసీ న్యూస్ రిపోర్ట్‌లో ఉంది. కేజీబీ మాజీ అధికారి అయిన పుతిన్‌కు తన చుట్టూ ఉన్న ప్రమాదాల గురించి బాగా తెలుసు. రష్యాలో అనేక భద్రతా సంస్థలు ఉన్నాయి. వాటిలో ఒక సంస్థ ప్రత్యేకంగా అధ్యక్షునికి, ఆయన కుటుంబానికి భద్రత కల్పించడానికే పనిచేస్తుంది. దీనిని రష్యన్ ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ లేదా ఎస్‌బీపీ అని పిలుస్తారు. ఇది రష్యా గూఢచార సంస్థ కేజీబీ నుంచి ఏర్పడిన రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్ఓ)కు రిపోర్ట్ చేస్తుంది. నల్ల సూట్లు ధరించి, చెవులకు ఇయర్‌ఫోన్లు పెట్టుకున్న ఎస్‌బీపీ గార్డులు 24గంటలూ పుతిన్‌తో పాటుంటారు.



"పుతిన్‌తో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఈ ఏజెంట్లు 4 బృందాలుగా విడిపోయి, 4 భద్రతా వలయాలుగా ఏర్పడతారు" అని రష్యా ప్రభుత్వ యాజమాన్యంలోని మీడియా సంస్థ రష్యా బియాండ్ తెలిపింది. ఇందులో మొదటి బృందం అధ్యక్షుడి సమీపంలో ఉంటుంది. ఇందులో ఆయన వ్యక్తిగత గార్డులు ఉంటారు. రెండో వలయంలో ప్రజల దృష్టి పడకుండా ఉండేలా భద్రతా బృందాలను మోహరిస్తారు. మూడో వలయంలో ఉండే బృందం అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తూ, వారు అధ్యక్షుడి వైపు రాకుండా అడ్డుకుంటుంది. చివరిదైనా నాలుగో భద్రతా వలయంలో ఉండే గార్డులు పరిసరాలలో భవనాలపై మోహరిస్తారు. రష్యన్ భద్రతా నిపుణుడు గలియోటి భద్రతా సమస్యలను విశ్లేషించే మాయక్ ఇంటెలిజెన్స్ అనే కన్సల్టింగ్ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్నారు. "పుతిన్‌కు హెలికాప్టర్లు ఇష్టం ఉండవు. ఆయన సాధారణంగా చాలా పెద్ద నల్ల కార్లు, మోటార్ సైకిళ్లపై ఉండే భద్రతా సిబ్బందితో కూడిన భారీ కాన్వాయ్‌లో ప్రయాణిస్తారు. ఆయన ప్రయాణించే సమయంలో కొన్నిసార్లు డ్రోన్లు ఎగరడంపై ఆంక్షలు విధిస్తారు. ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు" అని బీబీసీ ముండోతో మార్క్ గలియోటి చెప్పారు. రష్యన్ ప్రెసిడెన్షియల్ (ఎస్‌బీపీ)కి రష్యన్ నేషనల్ గార్డ్ లేదా రోస్‌గ్వార్డియా మద్దతుగా ఉంటుంది. కొందరు దీనిని అధ్యక్షుని "వ్యక్తిగత సైన్యం"గా పిలుస్తారు. దీని అధికారిక విధుల్లో రష్యా సరిహద్దులను సురక్షితంగా ఉంచడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం వంటివి ఉన్నప్పటికీ ఇది రష్యా సాయుధ దళాలకు భిన్నమైన సంస్థ. వాస్తవానికి పుతిన్‌ను ప్రమాదాల నుంచి కాపాడటమే దీని అత్యంత ముఖ్యమైన పని. "రష్యన్ నేషనల్ గార్డ్ చాలా వరకు పుతిన్ వ్యక్తిగత భద్రత అని అందరికీ తెలుసు" అని యూకేలోని బాత్ విశ్వవిద్యాలయంలో రష్యా విద్యావేత్త స్టీఫెన్ హాల్ బీబీసీ ముండోతో అన్నారు.

# రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిసారి

మొదటి పేజి తరువాయి

విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

### 12.91 లక్షల మందికి కవరేజీ

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

### సింగరేణితో శ్రీకారం

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

### ప్రభుత్వానికి రూపాయి భారం లేదు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

### ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

### కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన



వెల్లడించారు.

### ఉద్యోగులకు హెల్త్‌కార్డు

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్

**బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదనన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితువు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పషం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు

# ఉర్దూ భాషాభివృద్ధికి సెమినార్లు దోహదం

గోరంట్ల అనంత సూర్య: జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల పరిధిలోని మోహతారా పద్మావతి సాహిబా సదర్ మదర్సా విద్యార్థులు 'సీరత్-ఉన్-నబీ' పేరుతో నిర్వహించిన ఉర్దూ సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఇటువంటి సెమినార్లు ఉర్దూ భాషాభివృద్ధికి దోహదపడటంతో పాటు విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. సెమినార్ కన్వీనర్ ఫిరోజ్ అహ్మద్‌ను అభినందించారు. మౌలానా షఫియుల్లా మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు నైతిక, మతపరమైన విలువలపై అవగాహన అవసరమన్నారు. మహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి గుణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమ ప్రాయోజకుడు, ప్రత్యేక అతిథి మెహబూబ్ బాద్షా మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి నైతిక విలువలను



అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల మైదానంలో వేదిక నిర్మిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుడు అజ్మతుల్లా మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి యువత అని, విద్యతో పాటు నైతిక విలువలను పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు ప్రధాన ద్వారం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. సెమినార్ కన్వీనర్, పాఠశాల ఉర్దూ సహాయకుడు ఫిరోజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉర్దూ భాషను అభివృద్ధి చేయడం, ప్రోత్సహించడం, మంచి నైతిక విలువలను పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య



ఉద్దేశ్యమని తెలిపారు. సెమినార్‌లో నాత్‌లు, కవితలు, సంభాషణలు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను మెహబూబ్ బాద్షా అందజేశారు. అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

# గోరంట్ల తహశీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గోరంట్ల, అనంత సూర్య: శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ గురువారం గోరంట్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన మ్యుటేషన్ దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలంలో కొనసాగుతున్న రీ-సర్వే



పురోగతిని సమీక్షించిన జాయింట్ కలెక్టర్.. సరిహద్దు వివాదాలకు తావులేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా పక్కా ఆధారాలతో భూ రికార్డులను సిద్ధం చేయాలని వీఆర్వోలు, సర్వేయర్లను ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సానుభూతితో విని పరిష్కరించాలని, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరై బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధు నాయక్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, వీఆర్ఓలు, మండల సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు, క్రమబద్ధీకరణపై 10 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక

అమరావతి, పుట్టపర్తి అనంత సూర్య: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టా అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై సీఎం సమీక్షించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించగా, మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు భూమిని గుర్తించినట్లు వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మరో 5.32 లక్షల ఇళ్లు



వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి



పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీఎం ఆదేశించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం వరకు ప్రతి దశను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ప్రత్యేక చొరవతో పర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు.

# కలెక్టర్ల సదస్సులో మంత్రి సవిత



పెనుకొండ/అమరావతి అనంత సూర్య: అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సదస్సు బుధవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో తొలిరోజు నాయకత్వం, రాష్ట్ర స్థూల



దేశీయోత్పత్తి, తాగునీరు, గృహ నిర్మాణం, జలధార, జిల్లాల ఉత్తమ విధానాలపై చర్చించారు. సదస్సులో శ్రీసత్యసాయి జిల్లా నుంచి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు అనువర్తనాలపై పాఠ్యపుస్తకం ప్రచురణ

అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : విద్యుత్ ఇంజినీరింగ్ రంగంలో కృత్రిమ మేధస్సు సాంకేతికత వినియోగంపై "విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు అనువర్తనాలు" పేరుతో రూపొందించిన పాఠ్యపుస్తకాన్ని డాక్టర్ జి.శ్రీనివాసన్, డాక్టర్ బి.హరిప్రసాద్ రచించారు. విద్యుత్ ఇంజినీరింగ్ రంగం వేగంగా ఆధునిక సాంకేతికత వైపు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు రచయితలు తెలిపారు. విద్యుత్ వ్యవస్థల పర్యవేక్షణ, లోపాల గుర్తింపు, విద్యుత్ డిమాండ్ అంచనా, విద్యుత్ వ్యవస్థల విశ్లేషణ, స్వయంచాలకీకరణ, స్మార్ట్ గ్రిడ్ వంటి ఆధునిక రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆవిష్కరించిన సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ క్రిష్ణ కిషోర్,



ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ బాబు, మేనేజ్‌మెంట్ రిప్రజెంటేటివ్ కె.శ్రీకాంత్ రెడ్డి, ఈఎం అనురాగ్ రెడ్డి, ఏఓ డాక్టర్ కె.మనోహర్ రెడ్డి రచయితలను అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ క్రిష్ణ కిషోర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం సంప్రదాయ ఇంజినీరింగ్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రస్తుతం పరిశ్రమల్లో వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, స్వయంచాలకీకరణ వంటి ఆధునిక సాంకేతికతలపై కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థల్లో ఇటువంటి పుస్తకాలు, పరిశోధనాత్మక రచనలు వెలువడటం విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. రచయితలు డాక్టర్ జి.శ్రీనివాసన్, డాక్టర్ బి. హరిప్రసాద్ మాట్లాడుతూ.. విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు వినియోగానికి సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు, ఆధునిక అనువర్తనాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థుల్లో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచడం ఈ పుస్తక ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బోధనతో పాటు పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన విద్యను ప్రోత్సహించే దిశగా ఇటువంటి విద్యా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

# మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన ర్యాలీ

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి అనంత సూర్య: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోక్సో



చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రత వంటి అంశాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేందుకు 100, 112, 1091, 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై వేధింపులు, హింస లేదా అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకుంటే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, చిన్నారుల రక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని శక్తి టీమ్ సిబ్బంది అవగాహన కల్పించారు.

# కొత్తచెరువులో ఘనంగా భారీ ఊరేగింపు




కొత్తచెరువు అనంత సూర్య: మండల కేంద్రంలో ఎనిమిది రోజులుగా ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం భారీ ఊరేగింపుతో ముగిశాయి. ఈ నెల 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమకు నిత్య పూజలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల ముగింపు సందర్భంగా వందలాది మంది కృష్ణ భక్తులు పురవీధుల్లో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. కృష్ణ భక్తి గీతాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి సభ్యులు శాంతి, సాయినాథ్, కల్పన, లలిత, పద్మ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో హిందూపురం తపాలా డివిజన్‌కు ప్రథమ స్థానం




హిందూపురం అనంత సూర్య: వ్యాపార అభివృద్ధిలో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో హిందూపురం తపాలా డివిజన్ ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో డివిజన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోస్టుమాస్టర్ జనరల్ వనం ఉపేంద్ర పాల్గొన్నారు. జూలై 21 నుంచి 23 వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రూ. 1.50 లక్షల వ్యాపారం సాధించిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వనం ఉపేంద్ర మాట్లాడుతూ పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, పొదుపు ఖాతాల వంటి తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. హిందూపురం డివిజన్ సాధించిన ప్రథమ స్థానం సమిష్టి కృషికి నిదర్శనమని డివిజన్ సూపరింటెండెంట్ ఎన్. రెడ్డిబాషా తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు రూ.కోటి నిధులు మంజూరు



పుట్టపర్తి, అనంత సూర్య: పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో పెండింగ్ నిధులు విడుదలయ్యాయి. ప్రాజెక్టుకు తక్షణం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లగా ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే సింధూర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతర, సురక్షిత తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిధుల మంజూరుపై ప్రజలు, ప్రాజెక్టు కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

అనంత సూర్య
తెలుగువార్త
శుక్రవారం 11 సెప్టెంబరు 2026

## సీఎం చంద్రబాబు దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దగ్గుపాటి

### – అర్బన్ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు

అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడులను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. ముఖ్యమంత్రి దంపతులకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ఆయన మరింత కాలం ప్రజలకు సేవలు అందించేలా ఆ దేవుడు ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలు చర్యలు తీసుకోవాలి

### – డీఎంహెచ్ఓను జనసేన నాయకులు



అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : నగరంలో ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్, రక్త పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని గురువారం జనసేన నాయకులు డీఎంహెచ్ఓ కట్టా వెంకటేశ్వర్లును కోరారు. కొన్ని కేంద్రాల్లో అర్హత కలిగిన పాథాలజిస్టులు, రేడియాలజిస్టులు లేకుండా టెక్నీషియన్లతోనే పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని ల్యాబ్‌లను సీజ్ చేసి, తప్పుడు రిపోర్టులిచ్చే కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాలగిరి చరణ్‌తేజ, నాగసముద్రం భూపతి, పసుపులేటి రమేష్, మంజునాథ్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతే తమకు ముఖ్యం

అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : నగరంలోని ది ట్రెల్లిస్ స్కూలులో జరిగిన దురదృష్టకర ఘటనకు సంబంధించి గురువారం ఆ పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ శ్రీకాంత్ వద్ద మీడియాతో మాట్లాడారు. తమ పాఠశాలలో జరిగిన ఘటన పట్ల తాము తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు.



బాధిత చిన్నారికి న్యాయం జరగాలని మొదటి నుండి కోరుకుంటున్నామని, నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టాయిలెట్ క్లీనర్ యల్లప్పను వెంటనే విధుల నుండి తొలగించామన్నారు. అతను ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నాడని, చట్ట ప్రకారం అతనికి కఠిన శిక్ష పడాలని తాము కూడా కోరుకుంటున్నట్లు చెప్పారు. తాము బాధిత చిన్నారి తల్లిదండ్రులను నిందించడం లేదని, పోలీసు శాఖను గానీ, ప్రభుత్వాన్ని గానీ నిందించడం లేదన్నారు. పోలీసు వారు చాలా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని, వారికి తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. అయితే ఈ ఘటనను ఆసరాగా చేసుకుని, బాధిత కుటుంబానికి బంధువు అని చెప్పుకుంటున్న ఓ మధ్య వ్యక్తి పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసిన మాట వాస్తవం అన్నారు. డబ్బు ఇస్తే మీడియా, యూనియన్ల నుండి కాపాడతామని, లేకపోతే పాఠశాల ప్రతిష్టను దెబ్బతీస్తామని బెదిరించారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలను తమ వద్ద ఉన్నాయన్నారు. తమ విద్యాసంస్థలో 1800 మంది విద్యార్థుల భద్రతే తమకు ముఖ్యమన్నారు. టాయిలెట్ల వద్ద ఇకపై పూర్తిగా మహిళా సిబ్బందిని మాత్రమే నియమిస్తామన్నారు. సీసీటీవీ నిఘా, భద్రతా సిబ్బందిని మరింత పెంచుతామన్నారు. దర్యాప్తు నిమిత్తం పోలీసులు అడిగిన హార్డ్ డిస్క్, ఎన్వీఆర్‌లను స్వచ్ఛందంగా అప్పగించామన్నారు. తల్లిదండ్రులు ఎటువంటి వదంతులు, సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దని, పూర్తి వాస్తవాలు పోలీసు దర్యాప్తులో బయటకు వస్తాయని, పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ చట్టాన్ని గౌరవిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఎస్ఆర్‌లో ప్రెషర్స్ డే వేడకలు

అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : నగరంలోని ఆర్డీటీ స్టేడియం



వద్ద నున్న ఎస్ఆర్ ప్రైమ్ జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ క్యాంపస్‌లో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనంతపురం జోనల్ ఇన్చార్జ్ ముప్పిడి శివకుమార్ విద్యార్థులకు మంచి సందేశాన్నిచ్చారు. 2021 మార్చిలో ప్రారంభమైన ఎస్ఆర్ జూనియర్ కాలేజీ అంచెలంచెలుగా ఎదుగుతూ, నేడు 3 కాలేజీలు, ఒక స్కూల్ గా అనంతపురం పట్టణంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అభివృద్ధి చెందిందన్నారు. మా కాలేజీకి తల్లిదండ్రులే దేవుళ్ళు, వారి కోరిక మేరకు తాము సంవత్సరం చదువులో ఇంప్రూవ్ అవుతున్నామని తెలియజేశారు. ఇంత బాగా కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులను, టీచింగ్, నాన్–టీచింగ్ స్టాఫ్‌ను ఎస్ఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ వరదా రెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేంద్ర రెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ రాధాకృష్ణ, ఏజీఎం సి.జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ నిర్మల, ఎసఆర్ బాయ్స్ క్యాంపస్ ప్రిన్సిపాల్ జగదీష్ బాబు, గుత్తి రోడ్ ప్రిన్సిపాల్ భవాని, ఏజీఎం కల్పన పాల్గొన్నారు.

## ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని మీరా.. డీఎస్సీ గురించి మాట్లాడేది




అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టులు కూడా భర్తీ చేయని నాయకులు.. ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 35వ విడత సీఎంఆరఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 20 మందికి 17 లక్షల 82వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 713 మందికి 7కోట్ల 12లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కేవలం రెండేళ్లలోనే ఇంతమందికి సాయం చేశామని, అయితే గత వైసీపీ పాలనలో కనీసం 80 లక్షల రూపాయలు కూడా సీఎంఆరఎఫ్ ద్వారా సాయం అందించలేదన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సంహ్వనాశనం చేసి వెళ్లిపోతే.. కేవలం ఏడాదిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు మంత్రి నారా లోకేష్ ఇంకోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలన రాష్ట్రానికి 25 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో రాయలసీమ అంటే కరవు ప్రాంతంగా చెప్పుకునే వారని ఇప్పుడు అదే ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చారన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు ప్రతిష్టాత్మక కంపెనీలు తీసుకొచ్చారన్నారు. పుట్టపర్తి ప్రాంతానికి లక్ష కోట్ల పెట్టుబడితో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకంతోనే 16,347 పోస్టుల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేశారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరే విధంగా మార్పులు తీసుకొచ్చారన్నారు. గతంలో ఉపాధ్యాయులను బాత్రూంల వద్ద, వైన్ షాపులు వద్ద ఉంచి అవమానించిన వైసీపీ వారు ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారన్నారు. అసలు వారికి డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హంద్రీనీవా గతంలో కేవలం 1800 క్యూసెక్కులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు ఏకంగా 4వేల క్యూసెక్కులకు పెంచి శ్రీశైలం నుంచి నీరు తీసుకొస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో రూ.1296 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. రూ.250 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మరో రూ.310 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు.. నలుగురు అరెస్ట్

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 10 అనంత సూర్య : నగరంలో నిఘా పెరగడంతో రూట్ మార్చి, కళ్యాణదుర్గం–అనంతపురం నేషనల్ హైవే రహదారిలోని హంద్రనివాసుల స్రవంతి కాలువ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఆత్మకూరు పోలీసులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ జగదీష్, ఆదేశాలతో అనంతపురం రూరల్ ఇన్చార్జి డీఎస్పీ ఎం.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్, ఆత్మకూరు ఎసఐ లక్ష్మణరావు, సిబ్బంది ఈ ఆపరేషన్ నిర్వహించారు. 1,500 గ్రాముల (1.5 కిలోలు) నిషేధిత గంజాయి, రవాణాకు ఉపయోగిస్తున్న పల్సర్, యమహా 15 స్పోర్ట్స్ బైకులు, 3 స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కాకిమాని రాజు శ్రీరాంపురం కాలనీ, బళ్లారి టౌన్, కర్ణాటక, నల్లబోతుల సుంకన్న ముసలమ్మ కట్ట, అనంతపురం, ఎడవాల మహేష్ అలియాస్ గుణ బిందెల కాలనీ/1వ రోడ్డు, అనంతపురం, చట్టపరిధిలోని బాలుడు (మైనర్), పాత నేరస్థుడి హస్తం : అరెస్టయిన వారిలో ఎడవాల మహేష్ అలియాస్ గుణపై గతంలో రెండు తీవ్రమైన హత్య కేసులు ఉన్నట్లు పోలీసు రికార్డుల్లో నమోదైంది. అనంతపురంలో తనిఖీలు కఠినతరం కావడంతో, బళ్లారికి చెందిన రాజుతో కలసి మిగిలిన నిందితులు ఆత్మకూరు, కళ్యాణదుర్గం గ్రామీణ ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని అక్రమంగా గంజాయి అమ్ముతూ డబ్బు సంపాదించాలని చూశారు. పక్కా సమాచారంతో



పోలీసులు వీరి ఆట కట్టించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు. సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని పోలీసులు సూచించారు.

## డీటీసీ శిక్షణార్థులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 10 అనంత సూర్య : పోలీస్ పరేడ్ మైదానంలో.. డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ శిక్షణ పొందుతున్న 101 మంది (శిక్షణార్థి కానిస్టేబుళ్ల)కు గురువారం మూడు రోజుల క్రీడోత్సవం ఘనంగా ప్రారంభమైంది. పోలీస్ ట్రైనింగ్స్ విభాగం డీఐజీ కె.కె.ఎన్ అన్బురాజన్ ఉత్తర్వులు, జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీటీసీ ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలను ప్రారంభించారు. క్రీడా ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా క్రీడాజ్యోతి (కాగడా)ని వెలిగించి, పోలీస్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శాంతికి ప్రతీకగా తెల్ల కపోతాలు, గాలిపటాలు, బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. ఆ తర్వాత అదనపు ఎస్పీ పచ్చజెండా ఊపి 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు పోటీలను ప్రత్యక్షంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం మాట్లాడుతూ..





నిరంతరం శారీరక, మానసిక ఒత్తిడితో కూడిన పోలీస్ ఉద్యోగంలో క్రీడలు ఉల్లాసాన్ని, మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పోటీపడి సేవారంగంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని శిక్షణార్థులకు సూచించారు. మూడు రోజుల పాటు సాగే ఈ క్రీడోత్సవంలో శిక్షణార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ : 100, 200, 400, 800 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందెం, 4ఇ100, 4×400 మీటర్ల రిలే రేస్‌లు. అలాగే లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, షాట్ పుట్. టీమ్ గేమ్స్ అండ్ ఇతరులు : వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలతో పాటు మానసిక ఏకాగ్రత కోసం యోగా ప్రదర్శనలు, ఈకార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ బి.విజయకుమార్, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆరఐ రాముడు, పలువురు ఆరఎసఐలు, పోలీస్ సిబ్బంది, క్రీడా శిక్షకులు, 101 మంది శిక్షణార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా అన్వర్

అనంతపురం, సెప్టెంబర్ 10 అనంత సూర్య : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్వర్‌ను నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు, ఏఐసీసీ సభ్యులు దాదాగాంధీ సమావేశమై అన్వర్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాదాగాంధీతోపాటు సీనియర్ నాయకులు, ఏఐసీసీ, ఏపీసీసీ డెలికేట్ సభ్యులు కాపు గాజుల వాసు, తాడిపత్రి ఇంచార్జ్ బి.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ధీటుగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టి పోటీ ఇస్తామన్నారు. టీడీపీ, వైసీపీల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌కు శుభకాంక్షలు తెలిపారు. ఎంపికైన అన్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి





చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి మౌలానా నవాజ్ చిస్థి ఉల్ ఖాద్రీ సాహెబ్, రాష్ట్ర స్పోక్ పర్సన్ జాకీర్ హుస్సేన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు షర్మాస్ వలి, ఐఎన్టియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణస్వామి, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు షఫి, నగర నాయకులు నరసింహారెడ్డి, అనిల్ కుమార్, 1వ డివిజన్ హనీఫ్, తాడిపత్రి జావీద్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405